# పాతసమస్యలు కొత్త పరిష్కారాలు

"ఏమండోయ్. ఇంకా యీ వేషం లోనే వున్నారేం? తొందరగా తయారవండి" అని గావు కేక పెట్టి చిందులు తొక్కడం ప్రారంభించాడు శ్రీకంఠయ్య.

బనియను కూడా తీసేసి, పంచె బొడ్డు కిందకి జార్చి బొజ్జకి గాలి తగిలినా హాయి ననుభవించాలని ప్రయత్నిస్తున్న సమయంలో, సంగీతంలో అపస్వరంలా, ప్రత్యక్షమయాడు శ్రీకంఠయ్య.

"ఎక్కడికండీ."

"రామాయణమంతా విని రాముడికి సీతేమవుతుందని అడిగినట్టుంది. ఎక్కడికంటూ చేమిటి? పదండి ముందు" శ్రీకంఠయ్యతో వొచ్చిన తగాదాయే ఇది. కచ్చుల్లో కందులు వేసేస్తాడు అసలు సంగతి తేల్చకుండా. కాఫీ తాగడానికి కూడా సావకాశం లేదన్నాడు. ఒక్క సెకండన్నా అటూ ఇటూ కాకుండా సరిగ్గా ఆరు గంటలకే ఆరోగ్య మంత్రిగారు సెమినారు ప్రారంభం చేస్తున్నారుట. అంతకి అయిదు నిమిషాలు ముందుగానే అందరూ కుర్చీల్లో కూర్చోవాలిట. దేశ విదేశాలనించి మహామహు లందరు పాల్గొనబోతున్న ఆ సెమినార్‌కి హాజరవకుండా వుండకూడదుట.


కారణం, గమ్యస్థానం పూర్తిగా తెలుసుకోకుండానే బయలుదేరాను. నిజానికి శ్రీకంఠయ్యకి కూడా గమ్యస్థానమే తెలుసును కాని, సెమినారెందుకో తెలియదని దారిలో తేలిపోయింది. పరుగెత్తుకుంటూ హాలుకి చేరుకున్నాము. హాలు అలంకరణ బ్రహ్మాండంగా వుంది. జెండాలు, తోరణాలే కాకుండా గోడలనిండా తగిలించిన గ్రాఫులూ, నినాదాలూ కూడా హాలుని రంగులమయం చేశాయి. వేదిక మీద, నాయకుల కుర్చీల వెనక తెల్లటి తెర, దానిమీద కొట్టొచ్చినట్టు నల్లటి చిత్రం. మనకి చిరపరిచితమయిన జంతువు, ఎలక! ఈ సెమినారు ఎలకల సంహారానికి సమగ్ర పథకం ఆలోచించి, కార్యక్రమం నిర్ణయించేటందుకు

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

ఏర్పాటుయిందిట. భారత దేశానికి ఎలకల వల్ల కలుగుతున్న ముప్పు వివరించి, భారతీయులందరినీ అప మత్తులుగా చేసి ఎలకల సంహారానికి నడుంకట్టించే నిమిత్తం దేశీయ నిపుణులేకాక, విదేశీ నేతలుకూడా విచ్చేశారు. కేవలం రష్యా, ఇంగ్లండు, అమెరికా వంటి ప్రముఖ దేశాల నుంచే కాక, కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించుకున్న ఆఫ్రికా దేశాల నుంచీ, మధ్య, దూర ప్రాచ్యాల నుంచీ కూడా నిపుణులు హాజరయారు. ప్రపంచంలో, భారతదేశం ఎంత ప్రముఖ స్థానం, ఎంత కీలకపాత్ర వహిస్తోందో దీనివల్లే తేటతెల్లమవుతుంది. లేకపోతే, కేవలం ఎలకల్ని చంపించేందుకు ప్రపంచం నాలుగు మూలల్నించీ మనకి సలహాలివ్వడానికి మనుషులొస్తారా?

పెద్దలంతా వొచ్చి వేదిక అలంకరించారు. అలవాటు ప్రకారం అరగంట ఆలస్యంగాగాని ఆరోగ్య మంత్రిగారు హాలుకి విచ్చేయలేదు. నిజానికి వారు సమయానికే వొచ్చినా, కార్యకర్తలతో అల్పాహారం విందారగించి, ఫొటోలు దిగడంలో కాలాతీతమయిందిట, వారు యాథాలాభంగా క్షమాపణ చెప్పి తమ గంభీరోపన్యాసంలో, దేశంలో ఎలకలు సంవత్సరానికి ఏ విధంగా వృద్ధి చెందుతున్నాయో, దీనివల్ల ఎంతపంట నష్టమవుతోందో, దానివల్ల ఎంతమంది తిండి లేకుండా పోతున్నారో దానివల్ల ఎంత రాజకీయ అల్లకల్లోలం పెరుగుతోందో, వివరించి చెప్పారు

దేశంలో నూట ఎనభై కోట్ల ఏడు వేల మూడువందల ఇరవై రెండు ఎలకలున్నాయట. అవి తినేసే గింజల పరిమాణాలు కూడా టన్నులలో ప్రారంభించి గ్రాముల దాకా చెప్పారు. ఆ అంకెలు వింటే కళ్ళు చీకట్లు కమ్మాయి. ఎంతమంది రిసెర్చి విద్యార్థులు, ఎంత కృషిచేస్తే యీ వివరాలు లభించాయా అని ఆశ్చర్యంతో బుర్రకూడా తిరిగిపోయింది. దేశంలో నిజానికి ఎన్ని ఎలుకలున్నాయో ఆరా తియ్యడానికి అమెరికానించి ఒక నిపుణుల సంఘం తమ స్వంత ఖర్చులతో దేశమంతా పర్యటించి, ఆరు వారాలు అహోరాత్రాలు కష్టపడిందిట. అమెరికన్లకి రిసర్చి అంటే చాలా ప్రీతి. ఆ మధ్యని ఎక్కడో చదివాను, ఒకాయన ఐస్‌క్రీముని గురించి రెండున్నర సంవత్సరాలు ఘోర రిసెర్చిచేసి డాక్టరేట్ బిరుదం సంపాదించుకున్నాడట. ఆయన పదిహేడు వేల మూడు వందల ఇరవై నాలుగు రకాల ఐస్‌క్రీములు పరిశోధించాడట. రకరకాల ఆకారాలు, రకరకాల రంగులలో వున్న ఐస్‌క్రీములు. ఇన్నీ భక్షించి, రుచి చూసి, కనిపెట్టిన సిద్ధాంతం, ఐస్‌క్రీములో తీపితనం వేసిన పంచదార పరిమాణాన్ననుసరించే పోని



వృద్ధులు పొందుతుంది. తేట మాటల్లో సారాంశం చెప్పాలంటే, 'ఐస్‌క్రీములో పంచదార ఎక్కువ వేస్తే తీపి ఎక్కువగా వుంటుంది. తక్కువ పంచదార వేస్తే, తీపి తక్కువవుతుంది' ఇది నిరూపించడానికి ఆయన కేవలం అంకెల పట్టీలే కాక, రంగుల గ్రాఫులూ, వారు తిన్న కొన్ని ముఖ్య ఐస్‌క్రీముల ఫొటోలు కూడా తగిలించారు పి. హెచ్. డి. వూరికే లభిస్తుందా?

ఇంతకీ చెప్పవొచ్చే దేమిటంటే. ఆ దేశంనించి వొచ్చిన రిసెర్చి బృందమే మన దేశంలో వున్న ఎలకల అంచనా తయారు చేసింది. కనక, మనం ఆ సంఖ్యని అనుమానించ కూడదు. మనం తినవలసిన ఆహారం ఇన్ని ఎలకలు తినేస్తున్నాయే అని గుండెలు బాదుకోవాలి. ప్రమాదం గుర్తించి వాటి సంహారానికి, వాటి సంఖ్యా నిరోధానికి పూనుకోవాలి. వీటికి మార్గాలు అన్వేషించడం యీ సెమినారుకి మరో ప్రధాన ఆశయం.

ఎలకల్ని వేటాడి, పట్టి చంపడానికి ప్రతి రాష్ట్రంలోనూ స్పెషలు సిబ్బందిని, జీవులతోసహా,



నియమించాలని సూచన చేసి వుంటారని మీరు తేలికగా వూహించుకోవచ్చును. ఈ సిబ్బందే కాక, ఎలకల వెంటబడి, ఎలా తేలికగా పట్టుకో వొచ్చునో, కరిచేలాగ నోటి దగ్గర చెయ్యి పెట్టకుండా తోక ఎలా పట్టుకుని, గిరగిర తిప్పి, నేలకి వేసికొట్టి దానిని చంపవచ్చునో, జనసామాన్యానికి తర్ఫీదు ఇచ్చేటందుకు వరో స్పెషలు సిబ్బందిని నియమించాలన్న మరో సూచన కూడా అంగీకార ముద్ర సంపాదించుకుంది. ఎలక మన మహాశత్రువు. ఈ మహాశత్రువుతో పోరాడి ఘన విజయం సంపాదిస్తే గాని మనకి విమోచనం లేదు ఏ యుద్ధమూ కేవలం జవాన్లే సాధించలేరు. పౌరులందరూ కూడా పాల్గొని, దీన్ని ప్రజాయుద్ధం చేసి, ఆధునిక మారణ సామగ్రి మొదలు పురాతన హస్తలాఘవందాకా ఉపయోగించి, వాటిని రూపుమాపాలి అన్నది సెమినారు వ్యక్తీకరించిన సిద్ధాంతం.


సంహార విషయంలోకంటె విరోధన విషయంలో నిపుణులు కనిపెట్టిన కొత్త సిద్ధాంతాలూ, చేసిన సూచనలూ, చాలా ప్రజ్ఞావంతంగా, విప్లవాత్మకంగా వున్నాయనడానికి సందేహం లేదు. అక్కడ వివరించిన వైజ్ఞానిక విషయాలు కొన్ని నా మెదడు గ్రహించలేక పోయింది. అర్థమయిన, అథవా, అర్థమయింది అనుకున్న రెండు విషయాల్ని గురించి చెబితే, విషయం ఎంత సూక్ష్మమో, ఎంత క్లిష్టమో, వైజ్ఞానిక ప్రగతి సాధించడానికి ఎంత అవకాశ ముందో మీరే గ్రహించగలరు.

ఒక నిపుణుడు కనిపెట్టిన విషయం: గ్రామాల్లో, పొలాల్లో నే వుండవలసిన కొన్ని రకాలయిన ఎలకలు, ఇప్పుడు బొంబాయివంటి నగరాల్లో వొచ్చిపడ్డాయి. దీనికి కారణాలు ఏమిటి? పంచవర్ష ప్రణాళికల్లో పరిశ్రమాభివృద్ధివల్ల, గ్రామాల్లోనించి ప్రజలు పట్టణాలకొచ్చి పడుతున్నారు. గ్రామాల్లో

ధాన్యం కూర్చే పంటలు తక్కువయి, నగరాల్లో నిలవుంచే దిగుమతి ధాన్యాలు ఎక్కువ అవడమే దీనికి కారణమా, మరి యితర ముఖ్య కారణా లేమయినా వున్నాయా? గ్రామాల్లో వుండవలసిన ఎలకలు గ్రామాల్లోనే వుండేటట్టు కట్టడి చెయ్యడం ఎలాగ? ఇటువంటి పరిశోధన మన దేశంలో అత్యవసరం. లేకపోతే పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రం వల్లించినట్టు, గ్రామ ఎలకల నిరోధానికీ, పట్టణ ఎలకల సంహారానికీ ఒకే పరిష్కారం తయారుచేసే ప్రమాదముంది. దానివల్ల ఫలితం లేకపోగా, కొన్ని రకాల ఎలకలు పేట్రేగిపోయి, మరీ విజృంభించవచ్చును. ఈ విషయాలన్నీ పరిశోధించడానికి గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ వెంటనే రిసెర్చి ప్రాజెక్టులు ప్రారంభించాలి ఈ రిసెర్చికి కొంత సొమ్ము మద్దతుగా ఇవ్వడానికి కొన్ని దేశాలు తయారుగా వున్నాయి.

ఇంతకంటె మరో గొప్ప విషయం చెప్పాడు ఒక శాస్త్రజ్ఞుడు. ఎలకలు వూరికే పుట్టుకొస్తూ వుంటే, ఎన్నని, ఎంతకని సంహరించడం! మన దేశం, పంచవర్ష ప్రణాళికల వల్ల సాధించిన ప్రగతి అంతా జనాభా వృద్ధిలోనే హరించుకుపోయినట్టు, ఎలకల్ని యథాప్రకారం ఉత్పత్తి చేసుకోనిస్తూ వుంటే, ఎంత మారణ సామగ్రి, ఎంత బలగమూ వాటి నిర్మూలనానికి చాలదు. కనుక వాటి పెరుగుదల కూడా నిరోధించాలి. నిజానికి సంహార యత్నాలకంటె నిరోధ ప్రణాళికలకే ఎక్కువ ప్రాముఖ్యమివ్వాలి. మనుష్యులే సంతాన నిరోధక కార్యక్రమాల్లో ఉత్సాహవంతంగా పాల్గొనడంలేదే, ఎలకలు మనమాట వింటాయా అని నిరుత్సాహ పడనక్కర్లేదు. ఎలకల ఉత్పత్తి శక్తి తగ్గించడానికి వారు కొన్ని ప్రయోగాలు చేశారుట. అవి సఫలీకృతమయాయట. కనక ఎలకల యిష్టాయిష్టాలతో, వాటి సహకారంతో నిమిత్తం లేకుండా వాటి సంతాన నిరోధం అమలు జరపవచ్చును. సందేహానికి తావు లేకుండా, ఆ శాస్త్రజ్ఞుడు తన ప్రయోగాలన్నీ వివరించాడు. తిరుగులేకుండా సిద్ధాంతం ప్రతిపాదించాడు.

ఆయన చేసిన ప్రయోగం మొగ ఎలకల్ని, ఆడ ఎలకల్ని ఒకచోట పది రోజులు వుంచాడు. ఎన్ని ఎలక పిల్లలు పుట్టాయో లెక్కించాడు. మరో చోట అదే సంఖ్యలో ఆడ మగ ఎలకల్ని పెట్టి, ప్రతి పది నిమిషాలకీ, ఒక నిమిషం గట్టిగా గంట వాయించేవారు ఈ విధంగా ధ్వనిచే చెదరగొట్టబడిన ఎలకల



ఉత్పత్తి, నూటికి ముప్ఫయి శాతం తగ్గిపోయింది. ఎలకల కలయిక ఏమీ తగ్గలేదు ఆడ ఎలుక దృష్టిలో మొగ ఎలుక, తన ఆకర్షణ పోగొట్టుకోలేదు. ఉత్పత్తి మాత్రం తగ్గింది. ఇదే గాక మరో గొప్ప విషయం కూడా తేలింది. గర్భవతులయిన ఎలుకల సమీపంలో నలభై ఎనిమిది గంటలసేపు ఏకబిగిని గంట వాయిస్తే గర్భం పోతుంది, తల్లికి ఏమీ అపాయం కలగకుండా! గర్భం తాల్చిన ఎనిమిదో రోజునో, తప్పితే తొమ్మిదో రోజునో యీ గంట వాయింపు జరగాలి. తరవాత చేసినా ఫలితం లేదు. ముందు చేసినా ప్రయోజనం లేదు. కాని ఎనిమిది తొమ్మిదో రోజుల్లో నలభై ఎనిమిది గంటలు ఘంటానాదం చేస్తే, నూటికి ఎనభై వంతులు ఉత్పత్తి తగ్గిపోతుంది. అమోఘమయిన ప్రయోగం, అద్భుతమైన ఫలితాలు.

కృత్రిమసాధనాలేమీ లేకుండానే ఎలుకల సంతాన నిరోధంలో చెప్పుకోదగిన ప్రగతి సాధించవచ్చునని యీ ప్రయోగాలు నిరూపించాయి కనుక, ఎలుకలు ఎక్కువగా వుండేచోట గంటలు, డప్పులు వగైరాలు పెట్టుకని పదేసి నిమిషాల కొకమాటు ఒక నిమిషం సేపు వాయిస్తే, ఎలుకల ఉత్పత్తి తగ్గిపోతుంది. రెండో ప్రయోగ ప్రకారం కడుపుతో వున్న ఎలుకల ఎనిమిదో రోజు కనిపెట్టి గంట వాయిస్తే, యీ ఉత్పత్తి మరీ తగ్గిపోతుంది. కనక క్రమేపీ, వాటంతట అవే నశించిపోయే అవకాశముంది. రెండవది కొంచెం కష్టమయినా మొదటిది చాలా తేలికేగా! సూక్ష్మంలో మోక్షం. పదిమంది పోగయి గంటలు కొట్టి డప్పు వాయించడం ఏ గ్రామానికి

కష్టంకాదు అయితే ఒక క్రమంలో వాయించడం మంచిది. అతకతవకగా వాయించి కేవలం గొడవ చేసేస్తే, ఎలకలు ఆ రణగొణ ధ్వనికి అలవాటు పడిపోయి, తమ ఉత్పత్తి యధాప్రకారం కొనసాగించే ప్రమాదం కొంతవుంది. ఈ ప్రమాదం ఎంతా? అని ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కనుక కొంత జాగర్తగా వుండాలని వారు హెచ్చరించారు. ఈ జాగర్త తీసుకోడం కూడా గ్రామీణులకేమీ కష్టంకానిపని. అహింసాయుత సిద్ధాంతానికి కట్టుబడిన మన దేశానికి ఇది నిజంగా చాలా ఉపయోగకరమైన పద్ధతి

ఎలకల్ని చంపించడానికి ఇంత గొడవా? మంత్రులు రావాలా! సెమినార్లా! అన్న చులకన దృష్టితో చూస్తున్న నాకు ఎంత కనువిప్పు! ఎంత సూక్ష్మాతి సూక్ష్మ విషయాల మీద పరిశోధన జరుగుతోంది! సమస్యలు పాతవైనా, ఎన్ని కొత్త పరిష్కారాలు!

□□□

